క్లుప్తంగా

అన్న సమారాధన



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఎంపీ గీత

కొత్తపల్లి: కొమరగిరి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలోని పంచరత్న సుబ్రహ్మణ్యం దక్షిణమూర్తి పూర్వక, ఏకహ్నిక చండీశ్వర నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కొమరగిరి గ్రామం నుంచే కాకుండా గోర్స, వెంకటరాయపురం, చిన కలవలదొడ్డి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారిని ఎంపీ గీత దర్శించుకున్నారు. కమిటీ సభ్యులను, ఆలయ అర్చకుడుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్ కుమార్, కటారి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

హోమియో శిబిరంలో 180 మందికి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు చేశారు. సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ఆధ్వర్యంలో ఫిట్స్, చిన్నపిల్లల్లో మందబుద్ధి, మాటలు రాక పోవడం, మానసిక సమస్యలు, ఆస్తమా తదితర వ్యాధులకు ఉచితంగా మందులు అందజేశారు. వైద్య బృందం ప్రతినిధి పి.వీరభద్రరావు వైద్య పరీక్షలు చేశారు. సేవా సమితి సభ్యులు నవ్వుల బాబ్జీ, సూర్యచంద్రరావు, తోటకూర రాంబాబు, తేలుగుంట్ల నరసింహారావు, మండవిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో సమావేశం

కొత్తపల్లి: ఇసుకపల్లిలో శనివారం జనసేన పార్టీ నాయకులు చెరుకూరి అనంతలక్ష్మీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ మహిళల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మాకినీడి శేషుకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడపోతుల నూకరాజు, నక్క రామలక్ష్మీ, గుర్రాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: అమీనాబాద్‌కు చెందిన వాసుపల్లి కాశమ్మ ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, నాయకులు కంబాల లక్ష్మణ్‌రావు, నక్క తాతారావు, వంక కొండబాబు తదితరులు ఉన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఒక్కరోజు సుమారు 03,64,173 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. స్వామివారిని సుమారు పది వేల మంది దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో కాలువలోకి దిగి ప్రమాదావశాత్తు గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఏకే మల్లవరానికి చెందిన నలుగురు స్నేహితులు కత్తిపూడిలో ఒక డాబా హోటల్‌కు వెళ్లి అర్ధరాత్రి తిరిగి తమ గ్రామం చేరుకున్నారు. వారిలో వి.సాయికుమార్ ఎలియాస్ కాశీ గ్రామంలో ఉన్న చెరువు కాలువలోకి కాళ్లు కడుగుకుంటానని దిగాడు. అతను ఎంతకూ బయటకు రాకపోయే సరికి మిగిలిన వారు అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో విషయాన్ని అతని బంధువులు గ్రామస్తులకు తెలిపారు. దీంతో శుక్రవారం అతని కోసం గాలించిన ఫలితం కనిపించలేదు. తిరిగి శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైనట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

వ్యాధులకు డ్రైవాష్

- వ్యాధుల వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట
- అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు



గొల్లప్రోలు మండలంలో ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది



వన్నెపూడిలో ఇళ్ల మధ్య ఉన్న మురుగును చూపుతూ జాగ్రత్తలు వివరిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: ఒక పక్క ఎండలు మరో పక్క వర్షాలు ఈ సమయంలో వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాధులు రాకుండా ముందుగానే అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు వాష్ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా వ్యాధులు ఎక్కడ ఎలా విజృంభించే అవకాశాలు ఉన్నాయి వాటిని ఎలా నివారించాలనే విషయంపై దృష్టి సారించారు. ముఖ్యంగా క్రిమికీటకాదులు పెరిగి వ్యాధులకు కారణమయ్యే అవకాశాలను గుర్తించి వాటిని ఆదిలోనే నిర్మూలించేలా చర్యలు చేపట్టారు.

వాష్ ప్రోగ్రాంలో తీసుకునే చర్యలు

- నీరు, గాలి, ఈగలు మట్టి మలినాలు, అపరిశుభ్ర వాతావరణం, చేతులు శుభ్రం చేయకపోవడం వంటి వాటి వల్ల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్న విషయాన్ని వివరించడమే వాష్ ప్రోగ్రాం లక్ష్యం.
- శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. అంటు రోగాలకు కారణమయ్యే కుళ్లిన నిల్వ ఉన్న ఆహారాలు తినకుండా ప్రజలను అప్రమత్తం చేయడం.
- చేతులను శుభ్రం చేసుకునే విధానాలను వివరించడం వంటి చర్యలు తీసుకోవడం.
- గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయడం, వెక్టార్ బోర్న్ సిజెస్ డెంగీ, మలేరియా వంటి వ్యాధులు కలగజేసే దోమల నివారణకు చర్యలు తీసుకోవడం.
- గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దోమలు గుడ్లు పెట్టే అవకాశాలున్న పరిసరాలను గుర్తించి, మందులు చల్లేలా ప్రజలకు వివరించడం.
- ఎవరైనా వ్యాధుల బారిన పడితే వారిని వెంటనే ఆస్పత్రికి తరలించడం. తక్షణ చికిత్స అందించడం వంటి చర్యలు వేగవంతంగా తీసుకోవడం.

ఫ్రైడే డ్రైడే

శుక్రవారం డ్రై డేగా ప్రకటించిన వైద్య ఆరోగ్య శాఖాధికారులు గ్రామాల బాట పట్టి గ్రామాల్లో బృందాలుగా వెళ్లి అన్ని గృహాలు సందర్శించి ఇళ్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు గోతులు, ఖాళీ డబ్బాలు, డ్రైన్లు వంటి వాటిని పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేస్తున్నారు. ముఖ్యంగా బురద, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో అన్ని మురికి కాలువల్లోను దోమల వ్యాప్తి నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి ఇళ్లల్లో కుటుంబ సభ్యులు అందరిని పరిశీలించి వ్యాధులు ఉన్న వారికి తక్షణ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్యలతో వ్యాధుల నివారణ

గొల్లప్రోలు మండల గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. ఎక్కడ దోమలు వ్యాప్తి చెందుతాయో గుర్తించి వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ప్రతి ఆశ కార్యకర్త తమ తమ పరిధిలో ప్రతి రోజు 30 కుటుంబాలను సందర్శించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా అవగాహన కల్పించి, చర్యలు తీసుకున్నారు. మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, స్వైన్‌ఫ్లూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు నీళ్ల విరేచనాలు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు వివరిస్తున్నాం. బయట అమ్మే ఫుడ్, నిల్వ ఉన్న మాంసం, చేపలు, కుళ్లి పండ్లు వంటివి తిన్నా, ఇళ్ల వద్ద పారేసినా ఈగలు దోమలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్న విషయాన్ని వివరిస్తున్నాం. ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ శ్యామల, వైద్యాధికారి గొల్లప్రోలు

హక్కుల సాధన అందరి బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సరస్వతి

పెద్దాపురం: హక్కుల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సరస్వతి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో జడ్జిగా విధుల్లో చేరి ఐదు రోజులు కావస్తున్న నేపథ్యంలో శనివారం ఆమె న్యాయవాదులు, పోలీస్, వివిధ శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి సరస్వతి మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు మరింత అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రతి మహిళ చట్టంలోని హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సూచించారు. ఏపీపీ మృత్యుంజయరావు, న్యాయవాదులు మడికి రాంబాబు, ప్రభుజీ, కందుల వెంకటాచలం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. పీఎల్‌వీలు నూతలపాటి అప్పలకొండ, మూర్తి, ఎం.చంద్రరావు, లక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి బందిల రత్నలీల తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

కళా, సాంస్కృతిక రంగాల్లో రాణించాలి



తయారు చేసిన బొమ్మలను చూపుతున్న చిన్నారులు

సామర్లకోట: విద్యార్థులు విద్య, విజ్ఞానంతో పాటు కళా, సాంస్కృతిక రంగాలల్లో రాణించాలని కళారంగ రాష్ట్ర రిసోర్సు పర్సన్ పిల్లి గోవిందరాజులు అన్నారు. మాధవపట్నం శివారు జమునానగర్‌లో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో ఆయన పాల్గొన్నారు. వివిధ రకాల కళలపై ఆయన శిక్షణ తరగతులు నిర్వహించారు.

చదువే పరమాపదిగా...!

- పది పరీక్షల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- పెరిగిన ఉత్తీర్ణతా శాతం



సామర్లకోట పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

పిఠాపురం: ఆ విద్యార్థులు లక్షలకు లక్షలు ఫీజులు చెల్లించలేదు, తల్లిదండ్రులకు భారం కాలేదు, చదివించే, చదవు చెప్పే ఉపాధ్యాయులు ఉంటే చదివే సత్తా మాకుందంటూ అత్యధిక మార్కులు సాధించడం పెద్ద పని కాదని నిరూపించారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. ప్రభుత్వం నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేకలు మార్చేస్తే వాటిలో చదువుకున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు మాత్రమే ఉన్న అత్యధిక మార్కుల ప్రభంజనాన్ని పక్కకు నెట్టి ప్రభుత్వ పాఠశాలలకు సత్తా ఉందని నిరూపించారు. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం పట్టణం, మండలంలో 29 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 1709 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 1184 మంది ఉత్తీర్ణులవ్వగా 69.28 శాతం పాస్ నమోదైంది. తెలుగు మీడియం నుంచి 494 మంది పరీక్షలు రాయగా 207 మంది ఉత్తీర్ణులు అవ్వగా ఇంగ్లీషు మీడియం నుంచి 1215 మంది పరీక్షలు రాయగా 977 మంది ఉత్తీర్ణులయినట్టు ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్ తెలిపారు.

పది ఫలితాల్లో 52 శాతం ఉత్తీర్ణత

కొత్తపల్లి: పది పరీక్ష ఫలితాల్లో మండలం 52శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ శనివారం తెలిపారు. మండలంలోని 11 హైస్కూల్‌కు చెందిన 854 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు గాకా 432 ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి స్వామిరెడ్డి సత్యశ్రీ శివ గంగా ప్రభాస్ 582 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు.

కొనసాగిన చంద్రంపాలెం పాఠశాల ప్రతిభ

సామర్లకోట: 10వ తరగతి పరీక్షల్లో మొదటిసారిగా ప్రతి సబ్జెక్‌కు ఒక్క పేపరుతో పరీక్ష జరగడంతో ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. మండలంలో చంద్రంపాలెం (ఉప్పరగూడెం) జెడ్పీ హైస్కూల్ మరోసారి తన ప్రతిభను నిరూపించుకుంది. ఏటా ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 123 మందికి 61 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరిలో ఫస్టు క్లాసులో 26 మంది, సెకండ్ క్లాసులో 20 మంది, థర్డు క్లాసులో 15 మంది పాసైనట్టు ఎంఈఓ తెలిపారు. బీబీఆర్ మున్సిపల్ హైస్కూల్ 20 మందికి 12 మంది పాస్ కాగా, ఏడుగురు ఫస్టు క్లాసులోను, ముగ్గురు సెకండ్ క్లాసులో, థర్డు క్లాసులో ఇద్దరు పాస్ అయ్యారన్నారు. తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 28 మందికి 12 మంది పాసవగా, ఐదుగురు ఫస్టు క్లాసు, ఆరుగురు సెకండ్ క్లాసు, ఒకరు థర్డు క్లాసు సాధించారని తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 58 మందికి 19 మంది పాసయ్యారని చెప్పారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 139 మందికి 86 మంది పాస్ అయ్యారని తెలిపారు. చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 27 మందికి 24 మంది పాసయ్యారు. నవర హైస్కూల్‌లో 98 మందికి 87 మంది పాసయ్యారు. ఉండూరు హైస్కూల్‌లో 77 మందికి 50 మంది పాసయ్యారు. వేట్లపాలెం హైస్కూల్‌లో 158 మందికి 73 మంది, జి.మేడపాడు హైస్కూల్‌లో 116 మందికి 57 మంది, పీబీ దేవం హైస్కూల్‌లో 45 మందికి 26 మంది, పవర హైస్కూల్‌లో 28 మందికి 25 మంది, వీకే రాయపురం హైస్కూల్‌లో 73 మందికి 35 మంది, మాధవపట్నం హైస్కూల్‌లో 50 మందికి 26 మంది పాసైనట్టు ఎంఈఓ తెలిపారు. మండల పరిధిలో 900 మంది పరీక్ష రాయగా 531 మంది పాసైనట్లు చెప్పారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో 1507 మంది పరీక్షలు రాయగా 961 మంది పాసై 64 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం



వీకే రాయపురం కాజ్‌వే పరిస్థితిని గమనిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

- పొలాల ముంపు నివారణకు చర్యలు
- కలెక్టర్ ఆదేశాలతో పరిశీలించిన అధికారులు



వీకే రాయపురంలో మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురంలో పొలాల ముంపు నివారణకు చర్యలు తీసుకుటామని వివిధ శాఖల అధికారులు హామీ ఇచ్చారు. శనివారం సాక్షి దినపత్రిలో 'ఇరిటేషన్ వియర్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ కృతికా శుక్లా స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ఈఈ జి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంఏఓ ఐ సత్య గ్రామంలో పర్యటించి తూటేరు పూడిక తీతకు అంచనాలు తయారు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అలాగే ఏలేరు కాలువపై ఉన్న కాజ్‌వేకు మరమ్మతులు చేయిస్తామని డ్వామా తెలిపారు. దీంతో రైతులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భావితరాలకు ఇంధనాన్ని అందిద్దాం



వాహనదారులకు పీయూసీ చెక్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ, ఎస్ఐలు

కాకినాడ సిటీ: ఆయిల్ అండ్ గ్యాస్ సంరక్షణ కార్యక్రమం సాక్షం–2023 ద్వారా వాహనాలకు ఇంధన పొదుపు, పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు గెయిల్ ఇండియా లిమిటెడ్ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోందని ఆ సంస్థ డీజీఎం పేరి నాని అన్నారు. స్థానిక బోట్‌క్లబ్ వద్ద నిర్వహించిన ఆయిల్ అండ్ గ్యాస్ సంరక్షణ సాక్షం–2023 ఉచిత పీయూసీ శిబిరాన్ని సీఐ ఆకుల మురళీకృష్ణ, ఎస్సై ఎన్ సతీష్ శనివారం ప్రారంభించారు. రెగ్యులర్ వెహికల్ చెకప్, నిర్వహణ ద్వారా మంచి మైలేజీ పొందవచ్చని, భావితరాలకు ఇంధనాన్ని ఆదా చేయవచ్చని వివరించారు. గెయిల్ సిబ్బంది, సర్పవరం పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు. 375 వాహనాలకు ఉచితంగా పీయూసీ చెక్ చేయించి సర్టిఫికెట్లు అందజేశారు.

సెలవుపై జేసీ ఇలక్కియ

- ఇన్‌చార్జి జేసీగా మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ సెలవుపై వెళ్లారు. 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆమె సెలవుపై వెళ్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు శనివారం రాత్రి తెలిపాయి. ఆమె స్థానంలో ఇన్‌చార్జి జేసీగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఆయన శనివారం రాత్రి ఉత్తర్వులు అందుకున్నారు.

ముగిసిన ఎంఓటీల శిక్షణ

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనీలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యంలోని సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక కాగ వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు శిక్షణలో కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రసాద్, ఆంజనేయులు, నిహారిక పాల్గొన్నారు.

విధుల్లోకి విశ్రాంత ఉద్యోగి

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి గత నెల 30న పదవీ విరమణ చేసిన రత్నలీలను తిరిగి విధుల్లో చేరాలని శనివారం దేవదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దేవాదాయ శాఖలో కింది స్థాయి ఉద్యోగులకు 60 ఏళ్లకు పదవీ విరమణ ఇచ్చారు. కాగా ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితి 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆమె సోమవారం నుంచి విధుల్లో చేరనున్నట్టు రత్నలీల చెప్పారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

బాలాజీచెరువు: వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఉచితంగా నిర్వహిస్తున్న క్రీడ, యోగా పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వహించే వాలీబాల్, ఖోఖో, కబడ్డీ,యోగా, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ కీడల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రిజిస్ట్రార్ సుమలత, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

దిశ డీఎస్పీగా జయరాం ప్రసాద్



కాకినాడ క్రైం: కాకినాడ దిశ డీఎస్పీగా బి.మెహర్ జయరాం ప్రసాద్ నియమితులయ్యారు. 2018 గ్రూప్ అధికారిగా నేరుగా ఎస్‌డీపీవో బాధ్యతలు చేపట్టిన జయరాం ప్రసాద్ స్వస్థలం కాకినాడ జిల్లా. పల్నాడు జిల్లా గురజాల ఎస్‌డీపీవోగా తొలి పోస్టింగ్ చేపట్టిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉన్నారు. తాజాగా ఆయన కాకినాడ దిశ డీఎస్పీగా నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మోటారుసైకిల్‌పై ఉప్పాడ వెళుతుండగా కొత్తపల్లికి చెందిన ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై ఉప్పాడ నుంచి వస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, వారిని స్థానికులు పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కాకినాడుకు తీసుకెళ్లారు. పూర్తి వివరాలు వచ్చిన తర్వాత దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

కేశవానంద భారతి కేసుపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు చిత్రంలో అదనపు జిల్లా జడ్జిలు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ హాల్లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి మాట్లాడుతూ సుప్రీం కోర్టులో 13 మంది జడ్జిలతో కూడిన ధర్మాసనంతో చెప్పిన «కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ» కేసు తీర్పు ఇచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రలు, మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కి లేదని న్యాయవ్యవస్థ పరిధిలోనే ఉంటుందని ఈ తీర్పులో చెప్పినట్టు తెలిపారు. ఇప్పటి వరకు అటువంటి తీర్పు లేదన్నారు. సీనియర్ న్యాయవాది పి.రామచంద్రరాజు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, న్యాయశాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దతు ధర ఇచ్చి ఆదుకోండి



కళ్లంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రద్యుమ్న, పక్కన జేసీ ఇలక్కియ, జేడీఏ విజయ్‌కుమార్

- ప్రత్యేకాధికారికి అన్నదాతల వినతి
- పలు గ్రామాల్లో పంట నష్టం పరిశీలన

కరప: మండలంలోని పేపకాయలపాలెం, కూరాడ గ్రామాల్లో ఇటీవలి వర్షాలకు తడిసిపోయిన ధాన్యపు రాశులను ప్రత్యేకాధికారి పీఎస్ ప్రద్యుమ్న జిల్లా అధికారులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచనల మేరకు ఆయన శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి ధాన్యపు రాశులను, మొలకలు వచ్చిన వరి పనలను చూసి రైతులతో మాట్లాడారు. ఎలా ఆదుకుంటే మీ కష్టం తీరుతుందని అడిగిన ప్రశ్నకు రైతులు రైస్ మిల్లు వద్ద ఏ విధమైన కోతలు లేకుండా మద్దతు ధరకు కొనాలని, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా మంజూరు చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని వివరించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ప్రద్యుమ్న హామీ ఇచ్చారు. ఏ మేరకు నష్టపోయిందీ రైతులను అడిగి తెలుసుకున్నారు. జేసీ ఎస్.ఇలక్కియ, జేడీఏ ఎన్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.